క్లుప్తంగా

శరవేగంగా భూ సర్వే



హద్దురాళ్లు వేస్తున్న సిబ్బంది

జి.సిగడాం: గ్రామాల్లో సమగ్ర భూ సర్వే చేపట్టి సంబంధిత రైతు భూమిలో హద్దులు వేస్తున్నామని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్ ఆర్.సూర్యనారాయణ, సర్వేయర్ కృష్ణారావు అన్నారు. శుక్రవారం పాలఖండ్యాం పంచాయతీ జగన్నాథపురంలో భూమి హద్దులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేతో భూవివాదాలకు తెరపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ధారబోయిన రెయిమ్మ, ధర్మారావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

నాణ్యతగా మధ్యాహ్న భోజనం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: అరిణాం అక్కివలస ప్రాథమిక పాఠశాలను ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి శుక్రవారం పరిశీలించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం పరిశీలించి నిబంధనలు ప్రకారం మెనూ అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. డ్రాపౌట్లు లేకుండా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట సర్పంచ్ అంబటి శ్రీనివాసరావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు మాడుగుల మురళీధర్‌బాబా, వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు బొడ్డేపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా స్వామిత్వ సర్వే



సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

లావేరు: పెదలింగాలవలస పంచాయతీలో స్వామిత్వ న్యూ అప్రోచ్ గ్రౌండ్ ట్రూతింగ్ సర్వే చురుగ్గా సాగుతోంది. శుక్రవారం పంచాయతీ కార్యదర్శి ఎం.రమణ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పర్యటించి ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాల స్థితిగతులను పరిశీలించారు.

ఘనంగా ధర్మవరం పాఠశాల వార్షికోత్సవం



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎస్.శ్రీలక్ష్మి మాట్లాడుతూ విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, గోరుముద్ద వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయురాలు ఆర్.ఉషారాణిని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.కల్యాణి, ఉరిటి సూర్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు రంజాన్ తోఫా కిట్లు



నిత్యావసర కిట్లతో యువకులు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని జి.టి. రోడ్డులో ఉన్నజామియా మసీదులో జామియా మసీదు యువజన సభ్యులు రంజాన్ సందర్భంగా పేదలకు నిత్యావసర సరుకులు శుక్రవారం పంపిణీ చేశారు. సేమియా, పంచదార, గోధుమ పిండి, పాలు నెయ్యి, కిస్మిస్, జీడిపప్పుతో కూడిన 75 కిట్లను పేదల ఇళ్ల వద్దకు వెళ్లి అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

సెల్‌టవర్ వద్దని వినతి



సాయికుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న స్థానికులు

రణస్థలం: మండల కేంద్రంలోని రామతీర్థాలు వీధిలో బహుళ అంతస్తుపై సెల్ టవర్ ఏర్పాటు చేయవద్దని స్థానికులు కోరారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వీధి మధ్యలో టవర్ ఏర్పాటు వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు.

భక్తి, త్యాగాల సమ్మేళనం
రంజాన్

- ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమైన జామియా మసీదు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్:

ముస్లింల పవిత్రంగా భావించే మాసం రంజాన్. ఈనెల రోజుల పాటు ఉపవాస దీక్షలతోపాటుగా ఐదు ముఖ్య విధులు నిర్వహించారు. శనివారం సాయంత్రం చంద్రుడు కనిపించడంతో ఈదుల్ ఫితర్ (రంజాన్)ను జరిపేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని జామియా మసీదును విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. రంజాన్ నెలరోజులూ కలిమా చదవడం, ఐదుపూటలా నమాజు చేయటం, కఠిన ఉపవాస ఆచరించడం, సంపాదించిన దానిలో కొంత భాగం దానం చేయడం (జకాత్), హజ్ యాత్ర చేయటం వంటి విధులు నిర్వహించిన వారికి అల్లా కరుణించి, ఈతి బాధల నుంచి విముక్తి కలిగిస్తారు. ఖురాన్ ప్రకారం వెయ్యి రాత్రుల కంటే పుణ్యప్రదమైన, అతి పవిత్రమైన రాత్రి 'లైలతుల్‌ఖద్ర్' ఈ నెలలోనే వస్తుంది. నెల రోజుల పాటు చదివిన ఖురాన్ చివరి అంకాన్ని ఈ రాత్రితో ముగించారు.

నేడు ప్రత్యేక ప్రార్థనలు..

రంజాన్ సందర్భంగా శనివారం ఉదయం 9 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని జామియా మసీదు నిర్వాహకులు తెలిపారు. ముస్లింలంతా హాజరుకావాలని కోరారు.



విద్యుద్ దీపాల అలంకరణలో జామియా మసీదు

ఆర్టీసీ బస్సుల్లో ప్రథమ చికిత్స కిట్లు

శ్రీకాకుళం అర్బన్: పాతపట్నంకు చెందిన శ్రీరామా డెంటల్ క్లినిక్ అధినేత డాక్టర్ సలాన శరత్‌కుమార్ సౌజన్యంతో శ్రీకాకుళం ఆర్టీసీ 2వ డిపో పరిధిలోని బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం 2వ డిపో ఆర్టీసీ బస్సు గ్యారేజ్ ఆవరణలో డిపో మేనేజర్ కె.ఆర్.ఎస్.శర్మ సమక్షంలో 50 ఫస్ట్ ఎయిడ్ కిట్లను కండక్టర్లకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో కె.విజయ్‌కుమార్, మేనేజర్ నవీన్, సామాజిక కార్యకర్త నారాయణమూర్తి, ఆర్టీసీ భద్రతా – నిఘా విభాగ అధిపతి సూరప్పడు, అసిస్టెంట్ మేనేజర్ గంగరాజు, పీఆర్‌ఓ కె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.



డీఎం శర్మకు ప్రథమ చికిత్స కిట్లను అందజేస్తున్న దృశ్యం

యువ క్లబ్‌లతో పర్యాటకాభివృద్ధి

శ్రీకాకుళం న్యూకాలనీ: పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న యువక్లబ్‌ల ద్వారా జిల్లాలో టూరిజం మరింత అభివృద్ధి చెందుతుందని జిల్లా పర్యాటక శాఖాధికారి ఎస్.నారాయణరావు అన్నారు. జిల్లా పర్యాటక శాఖ, యువజన సర్వీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో యువక్లబ్–పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కెరీర్ గైడెన్స్‌పై శుక్రవారం నగరంలోని విద్యాధరి డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీపంలోని పర్యాటక ప్రదేశాలను సందర్శించి పర్యాటకాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువజన సర్వీసు అధికారి లక్ష్మణనాయుడు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవరుచుకోవాలన్నారు. విద్యాధరి కళాశాల డైరెక్టర్ జామి భీమశంకరరావు మాట్లాడుతూ యువ క్లబ్ ఆవశ్యకతను వివరించారు. అంతకుముందు బసవేశ్వర జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఇంటాక్ కన్వీనర్ రాధాప్రసాద్, కో–కన్వీనర్ నటుకుల మోహన్, సెట్‌శ్రీ మేనేజర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



బసవేశ్వర చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, అతిథులు

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి

ఎచ్చెర్ల క్యాంపస్ : ప్రతిఒక్కరూ కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని డాక్టర్ బొడ్డేపల్లి అనూష అన్నారు. ఎచ్చెర్లలో శుక్రవారం అంబేడ్కర్ వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజ్ జాతీయ సేవాపథకం యూనిట్–7 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా కంటి పరీక్షల వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. త్రినేత్రి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ బొడ్డేపల్లి అనూష ఆధ్వర్యంలో సిబ్బంది ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కంటి సంరక్షణ, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ ఏ.రాజేంద్రప్రసాద్, జిల్లా జాతీయ సేవాపథకం సమన్వయకర్త డాక్టర్ ఎం.అనురాధ, సోషల్ వర్క్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దంతులూరి వనజ, ప్రోగ్రాం అధికారి తొత్తిడి భవానీ, సర్పంచ్ టి.భవాని తదితరులు పాల్గొన్నారు.



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అనూష

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి



స్వచ్ఛ శ్రీకాకుళం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం: ప్రతిఒక్కరూ నీరు, పారిశుద్ధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఏపీ మాస్ రాష్ట్రస్థాయి మేనేజర్ ఎల్.భవానీ అన్నారు. శ్రీకాకుళంలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో శుక్రవారం డీఆర్‌డీఏ, ఏపీ మాస్ సంయుక్త ఆధ్వర్యంలో వ్యక్తిగత పరిశుభ్రత, నీరు, పారిశుద్ధ్యంపై జిల్లాస్థాయి వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సురక్షిత నీరు తాగాలని, అనారోగ్యం బారిన పడకుండా ఉండాలన్నారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ప్రతి ఇంటి వద్ద చెత్తను మూడు భాగాలుగా వేరుచేస్తే స్వచ్ఛ శ్రీకాకుళంగా తీర్చిదిద్దవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ సభ్యులు, ఏపీ మాస్ సభ్యులు, మున్సిపాలిటీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

నేడు, రేపు పన్నులు చెల్లించవచ్చు

ఆమదాలవలస: ఇళ్లు, ఖాళీ స్థలం పన్నులను ఈ నెలాఖరులోగా చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ వర్తిస్తోందని మున్సిపల్ కమిషనర్ ఎం.రవిసుధాకర్ శుక్రవారం తెలిపారు. ఈనెల 22, 23 తేదీలు సెలవు రోజులైనప్పటికీ పురపాలక సంఘం కార్యాలయంలో పన్నుల చెల్లింపునకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భూమిని కాపాడుకుందాం

నరసన్నపేట: మానవుల చర్యలతో కాలుష్యం పెరుగుతోందని..ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు అడవులను పరిరక్షించి భూమిని కాపాడుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత అన్నారు. కళాశాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూమి ప్రాధాన్యతను వివరించారు. భూమిని ఎలా కాలుష్యం చేస్తున్నామో విద్యార్థులకు తెలియజేశారు. చెట్లు, అడవులను రక్షించడం ద్వారా భూమిని కాపాడుకోవచ్చునన్నారు. బోటనీ అధ్యాపకుడు ఎస్.పరమేశ్వరారావు పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని తెలియచేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు శాంతి హేమ్, జీవీ రవికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లత

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

లావేరు: వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు చేపడుతున్నట్లు గుమడాం పంచాయతీ ఉప సర్పంచ్ దురగాసి ధర్మారావు, కార్యదర్శి శ్రీనివాసరావు అన్నారు. పంచాయతీ పరిధిలో పాడైన మంచినీటి బోర్లను శుక్రవారం బాగు చేయించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ బోర్ మెకానిక్‌లు ఎస్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ కార్యదర్శిగా శంకరరావు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయ ఇన్‌చార్జి(ఎఫ్ఏసీ) కార్యదర్శిగా వి.వి.జి.ఎస్.శంకరరావు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం శంకరరావు జిల్లా గ్రంథాలయ కార్యాలయంలో డిప్యూటీ లైబ్రేరియన్‌గా పనిచేస్తున్నారు. గ్రంథాలయ డైరెక్టర్ ఆదేశాల మేరకు అదనపు కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.

గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌ను కలిసిన డ్వామా పీడీ

శ్రీకాకుళం: గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ పి.సూర్యకుమారిని అమరావతి సచివాలయంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలవుతున్న తీరు, సగటు వేతనం, తదితర అంశాలను కమిషనర్‌కు వివరించారు.

ఉపాధి లక్ష్యాలు సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ సత్యనారాయణ

జి.సిగడాం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల లక్ష్యాలు సాధించకపోతే చర్యలు తప్పవని ఏపీఓ చోళ్ల సత్యనారాయణ అన్నారు. శుక్రవారం జి.సిగడాం మండల కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించాలన్నారు. వేతనదారులు రెండు పూటలా పనులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఈసీ గేదెల పురుషోత్తంనాయుడు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ సందర్శన



రామారావుకు స్వాగతం పలుకుతున్న ఈకో శ్రామిక్ యూనియన్

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్‌ను రైల్వే మెడికల్ డైరెక్టర్ డాక్టర్ డి.రామారావు శుక్రవారం సందర్శించారు. పలాస రైల్వే ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసి ప్రమోషన్‌పై మెడికల్ డైరెక్టర్‌గా వెళ్లిన అనంతరం, తొలిసారి పలాస రావడంతో ఆయనకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ పలాస బ్రాంచ్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పలాస రైల్వేస్టేషన్‌తో పాటు ఆస్పత్రిని పరిశీలించారు.

ఉత్సవాలకు సహకరించాలని విజ్ఞప్తి

పాతపట్నం: పాతపట్నం గ్రామ దేవత నీలమణి దుర్గ అమ్మవారి ఉత్సవాలు మే నెల 21 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఉత్సవాలకు సహకరించాలని కోరుతూ జిల్లా అధికారులకు శుక్రవారం వినతిపత్రాలను అందజేశారు. ఈ మేరకు జిల్లా అడిషన్ ఎస్పీ టి.పి. విఠలేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈవో ఆర్.వెంకట్రామన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ టి.ఎస్.ప్రసాద్, డీపీవో వి.రవికుమార్‌తోపాటు పలువురు అధికారులకు వినతిపత్రాలతో పాటు ఆహ్వాన పత్రికలను శుక్రవారం అందజేశారు. ఉత్సవాలకు తమ సహకారం ఉంటుందని అధికారులు హామీ ఇచ్చినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. జిల్లా అధికారులను కలిసిన వారిలో లింగాల మధుబాబు, కాళ్ల రాజు, పైల లక్ష్మయ్య, పెద్దింటి అప్పారావు, పైల బాబ్జీ, నూలు బుజ్జి, శాసనపూరి మధుబాబు, శిర్ల జోగారావు ఉన్నారు.

సజావుగా సర్పంచ్‌ల సంఘం ఎన్నికలు

శ్రీకాకుళం రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం శ్రీకాకుళం మండల సర్పంచ్‌ల సంఘ ఎన్నికలు సజావుగా జరిగాయి. సర్పంచ్‌ల సంఘం అధ్యక్షునిగా గేదెల చెంగల్వరావు(రాగోలు), ఉపాధ్యక్షునిగా కంచు రవణమ్మ(ఎస్ఎస్‌వలస), ప్రధాన కార్యదర్శిగా నీలంశెట్టి రామకృష్ణ(పొన్నాం), కార్యదర్శిగా సూరాడ సూర్యం(కుందువానిపేట), కోశాధికారిగా కొంక్యాన లక్ష్మీ(కరజాడ)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు లోలుగు శ్రీనివాసరావు, చిట్టి రవికుమార్, గంగు నరేంద్రకుమార్, రావాడ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆదుకోవాలని వినతి

శ్రీకాకుళం: చదువులో ప్రతిభ కనబరుస్తున్న రణస్థలం మండలం చిల్లపేటరాజాం గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థి కొంతల మణికంఠ నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో ఉన్నత చదువులకు ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎచ్చెర్ల నియోజకవర్గ టీడీపీ నేత కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. మణికంఠ రెండేళ్ల క్రితం టీసీఎస్ కంపెనీ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చి ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు తెలిపారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

జి.సిగడాం: భూ సర్వేలో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో సచివాలయాల సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సమక్షంలో తప్పులకు ఆస్కారం లేకుండా సర్వే చేపట్టాలన్నారు. సమావేశంలో డివిజనల్ సర్వేయర్ ఆర్.సూర్యనారాయణ, భూ సర్వే విభాగం డీటీ బి.హనుమంతరావు, డీటీ ఎస్.ఎస్. నిర్మల, సర్వేయర్లు కృష్ణారావు, మొయ్యి ఈశ్వరరావు, ఆర్ఐ రామచంద్రరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాలరావు

పార్కు ఏర్పాటుకు స్థల పరిశీలన



ముచ్చవానిపేటలో రిజర్వు స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని 50వ డివిజన్ ముచ్చవానిపేట పరిధిలో ఉన్న 20 సెంట్ల రిజర్వు స్థలంలో పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. రిజర్వు స్థలంలో కమ్యూనిటీ హాల్, గ్రంథాలయం, పార్కు ఏర్పాటు చేయాలని రాయి వేణుగోపాల్ ఆధ్వర్యంలో స్థానికులు కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ శుక్రవారం రిజర్వు స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ నిధులతో పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. కబ్జాదారుల నుంచి స్థలాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎవరైనా ఆక్రమణకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రంథాలయం, కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకి మీ వంతు ప్రయత్నం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్థానిక సచివాలయ సిబ్బంది, దళిత నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారిణి రూపాదేవికి సత్కారం

జి.సిగడాం: జాతీయ స్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీల్లో బంగారు, రెండు వెండి పతకాలను సాధించిన సంతవురిటి గ్రామానికి చెందిన పడాల రూపాదేవిని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జి.సిగడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తారకేశ్వరావు, రాధ దంపతులు శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో రంగారావు, రాము, సతీస్, పోలారావు తదితరులు పాల్గొన్నారు.



రూపాదేవిని అభినందిస్తున్న తారకేశ్వరరావు

అంకితభావంతో సేవలందించాలి

లావేరు: వలంటీర్లు అంకితభావంతో సేవలందించాలని లావేరు ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్ అన్నారు. పాతరౌతుపేట పంచాయతీలో నూతనంగా నియమితులైన వలంటీర్లకు శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ అధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, నాయకులు కొమ్ము సాయికుమార్, మహంతి నారాయణరావు, కొమ్ము సింహాద్రినాయుడు, రౌతు శ్రవణ్‌కుమార్, నడుపూరి ఈశ్వరరావు పాల్గొన్నారు.



వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

లావేరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ పథకాలు అందుతున్నాయని నాయకులు పేర్కొన్నారు. మండలంలోని అప్పాపురంలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు.. మానమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు వివరించారు. జగనన్న స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు. కార్యక్రమంలో అప్పాపురం పంచాయతీ సర్పంచ్ జగ్గురోతు నాగరత్నం, నాయకులు జగ్గురోతు సత్యనారాయణ, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.



అప్పాపురంలో పథకాలు వివరిస్తున్న నాయకులు

ప్రతి ఇంటికీ పోస్టల్ సేవలు



మాట్లాడుతున్న విశాఖ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ రాములు

టెక్కలి: ప్రతి ఇంటికీ పోస్టల్ సేవలు మరింత చేరువయ్యేలా క్షేత్రస్థాయి సిబ్బంది విధులు నిర్వహించాలని పోస్టల్ శాఖ విశాఖ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ వి.రాములు సూచించారు. స్థానిక హెడ్ పోస్టల్ కార్యాలయంలో టెక్కలి, సోంపేట సబ్ డివిజన్ పరిధిలో జీడీఎస్, బీపీఎం సిబ్బందితో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తపాల సేవలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు.

ప్రతీ కుటుంబం పోస్టల్ సేవలను వినియోగించుకునేవిధంగా ఉత్తమ సేవలు అందజేయాలన్నారు. పోస్టల్ శాఖ ద్వారా పొదుపు, బీమా అంశాలతో పాటు ఆర్‌డీ, ఆర్‌పీఎల్ఐ (రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్), మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఎంఎస్ఎస్‌సీ (మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికేట్) డిపాజిట్ పథకం సేవలపై అవగాహన కల్పించాలన్నారు. బాలికల కోసం ప్రత్యేకంగా కొనసాగిస్తున్న సుకన్య సమృద్ధి యోజన పథకం, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రూ.400లతో రూ.10 లక్షల ప్రమాద బీమా పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా సూపరింటెండెంట్ వి.సత్యనారాయణ, ఏఎస్పీ ఇంద్రసేన, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీకాంత్, స్థానిక పోస్టుమాస్టర్ భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.